క్లుప్తంగా

చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా రామకృష్ణ

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా వై.రామకృష్ణ నియమితులయ్యారు. ఉద్యోగుల బదిలీల్లో భాగంగా చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేసిన ఎస్తేర్‌రాణిని ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో విశాఖ కేజీహెచ్ నుంచి రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.

వెంకన్న ఆలయానికి విరాళం


వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. బుధవారం మునగపాకకు చెందిన పెంటకోట పరదేశినాయుడు జ్ఞాపకార్థం భార్య మాణిక్యం, కుమారులు ఓం శ్రీను, ఆనంద రామకృష్ణ రూ.25 వేలు నగదును విరాళంగా అందజేశారు. కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, ఆడారి కాశీబాబు, బొడ్డేడ రాము నాయుడు, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ, ఆడారి సత్యనారాయణ, పెంటకోట సారథి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణకు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. మునగపాకలో గృహాలు, కట్టడాలు కోల్పోతున్న పలువురు బాధితులు బుధవారం తహసీల్దార్ సత్యనారాయణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రహదారి విస్తరణ ద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నిర్వాసితులంతా ముందుకొచ్చి రహదారి విస్తరణలో భాగస్వాములు కావాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి జిల్లా ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. హరిపాలెం, అందలాపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, అలాగే వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, చోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, భోగాపురం రోడ్డు, రామన్నపాలెం, ఆవసోమవారం, ఆవరాజాం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీపీ రోడ్డు, కొరుప్రోలు, గుడివాడ, ఎల్‌పీఆర్‌పేట, బంగారమ్మపాలెం, కె.పోలవరం, కొరుప్రోలు కాయిర్ ఇండస్ట్రీ, చినఉప్పలం ఆక్వా సర్వీసెస్, గెడ్డపాలెం వాటర్ ప్లాంట్, వాతాడ, పెదఉప్పలం, రేవుపోలవరం, గుర్రాజుపేట గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

తప్పిన అగ్నిప్రమాదం


రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లంమార్కెట్ దుకాణాల వద్ద వ్యాపించిన మంటలు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లంమార్కెట్ యార్డు దుకాణాల వద్ద గల చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం నిప్పుపెట్టారు. మంటలు ఒక్కసారిగా ఎగసిపడడంతో మార్నింగ్ వాక్ చేస్తున్నవారు గుర్తించి, నాలుగు బైక్‌లు, రెండు కార్లను పక్కకు లాగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

నిరీక్షణకు తెరపడేనా.!


రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టే ప్రాంతం

- నాగరాజుపేట రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్‌కు ప్రతిపాదనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనచోదకులు


నాగరాజుపేట వద్ద రైల్వే గేటు వేయడంతో నిరీక్షిస్తున్న వాహనచోదకులు

పాయకరావుపేట: పట్టణంలోని నాగరాజుపేట రైల్వే గేటు వద్ద నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడేలా సూచనలు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణానికి రైల్వే శాఖాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నాగరాజుపేట రైల్వే గేటు కారణంగా పట్టణ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేట పట్టణం నుంచి జాతీయ రహదారికి వెళ్లడానికి, నర్సీపట్నం వైపు వెళ్లడానికి పట్టణంలోని లింగాలకాలనీ, దుర్గానగర్, అంబేడ్కర్ నగర్, ఇందిరా కాలనీ, శాంతినగర్, రెల్లీకాలనీ తదితర కాలనీలకు సైతం వెళ్లడానికి నాగరాజుపేట వద్ద ఉన్న రైల్వే గేటు కారణంగా ప్రజలు నిత్యం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ గేటును రైళ్ల రాకపోకల కోసం రోజూ 140 సార్లు వేస్తుంటారు. ప్రతి 5 నిమిషాలకు ఈ గేటు పడుతోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తుంది. దీంతో పట్టణవాసులతో పాటు రైల్వే గేటు అవతలి వైపున ఉన్న పలు కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలకు మార్గం సుగమం అవుతుంది. ఫ్లైఓవర్ ప్రతిపాదనల్లో భాగంగా రైల్వే శాఖ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులకు స్థల సేకరణ పరిశీలించాలని, ఎంత స్థలం అవసరం ఉంటుందో నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ వంతెనతో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఫ్లైఓవర్‌తో ఎంతో మేలు



ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే మండల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. మండల కార్యాలయాలకు వెళ్లడానికి ప్రజలకు నిరీక్షణ తప్పుతుంది. లింగాల కాలనీ, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, రెల్లీ కాలనీ, దుర్గా కాలనీ వాసులకు, నర్సీపట్నం వైపు, ఏజెన్సీ వైపు వెళ్లే వాహనచోదకులకు ఉపశమనం కలుగుతోంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు మోక్షం కలగనుంది.

– లంక సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు

గేటు ఎప్పుడూ మూసే ఉంటోంది



నాగరాజుపేట రైల్వే గేటు ఎప్పుడూ మూసే ఉంటోంది. మండల కార్యాలయాలకు వెళ్లడానికి ఈ గేటు వల్ల ఇబ్బంది పడుతున్నాం. అత్యవసర పరిస్థితిలో నరకం అనుభవిస్తున్నాం. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేపడితే అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు త్వరగా ప్రతిపాదనలు సిద్ధం చేసి వంతెన నిర్మాణం చేపట్టాలి.

– ఆడారి నూకరాజు, పాయకరావుపేట

సోలార్ ప్రాజెక్టుపై అవగాహన


రాజుపేటలో సోలార్ ప్రాజెక్టుపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

కోటవురట్ల: పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ పరమేశ్వరరావు కోరారు. రాజుపేట గ్రామంలో పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఏఈ మాట్లాడుతూ ఒక కోటి కుటుంబాలు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. సోలార్ ప్లాంట్ ప్రాజెక్టును రాయితీపై అందిస్తోందన్నారు. సోలార్ ప్రాజెక్టును ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ప్రతి నెలా 300 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు నేషనల్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సునీల్, లైన్ ఇన్స్‌పెక్టర్లు సత్తిబాబు, వల్లీ, లైన్‌మెన్ నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


యండపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఐవీఆర్‌ఎస్ గ్రామం యండపల్లిలో బుధవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రైనేజీలలో పూడికలు తీయించి, రక్షిత మంచినీటి పథకాలలో క్లోరినేషన్ చేయించారు. తాగునీటి నమూనా సేకరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. పరిశుభ్రతను పాటించాలని, చెత్తను రోడ్లపై ఇష్టానుసారంగా పడవేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎస్.రాయవరం: వేమగిరి శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,650 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మానవ అక్రమ రవాణా కట్టడికి సమష్టి కృషి


యలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

యలమంచిలి రూరల్: ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మానవ అక్రమ రవాణా సమస్యను అరికట్టడానికి సమాజంలో అన్ని వర్గాల వారు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ నెల 30వ తేదీ ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, మహిళల అక్రమ రవాణా పట్ల సమాజంలో అన్ని వర్గాల వారు జాగ్రత్తగా ఉండాలని బాలల హక్కుల సమితి జిల్లా ప్రతినిధి డి.లోవరాజు కోరారు. ప్రజలంతా ఐక్యంగా ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవాలన్నారు. పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకు నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమం యలమంచిలి రైల్వేస్టేషన్, బస్ కాంప్లెక్స్‌ల వద్ద బ్యానర్లు ప్రదర్శించి అవగాహన కల్పించారు. యలమంచిలి రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లలో అనుమానం వచ్చిన 18ఏళ్లలోపు మైనర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడ్ సంస్థ చైర్మన్ కేవీ చిన్నారావు, కమ్యూనిటీ సామాజిక కార్యకర్త అమ్మాజీ, కనకమహాలక్ష్మి, ఎస్ఐ కె.నవీన్, కానిస్టేబుల్ జె.అశోక్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలి


కొత్తరేవుపోలవరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని, సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యసత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కొత్తరేవుపోలవరం సచివాలయ సిబ్బంది, నాయకులతో సమావేశం అయ్యారు. గ్రామంలో సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

గాయపడిన స్నేహితునికి సాయం


గాయపడిన స్నేహితునికి సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితునికి ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల్లో ఒక్కరైన కర్రివానిపాలెం గ్రామానికి చెందిన కోసూరి యల్లారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు రూ.25 వేలు ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పారుపల్లి లక్ష్మణరావు, శిదిరెడ్డి జోగురాజు, జాగు గోపాలకృష్ణ, కర్రి రామకృష్ణ, తుమ్మపాల సురేష్‌కుమార్, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

అనకాపల్లి టౌన్: జిల్లాలోని హాస్టళ్లలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. స్థానికంగా నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఇటీవల హాస్టళ్లు, కళాశాలలను పరిశీలించినట్టు తెలిపారు. నర్సీపట్నం మండలం శివపురం గ్రామం ఎస్టీ–3 బాలికల హాస్టల్‌లో సుమారు 300 మంది విద్యార్థినులుండగా ఒకటే బాత్‌రూమ్ ఉందని, జిల్లా కేంద్రం అనకాపల్లిలో గల బీసీ బాలికల హాస్టల్‌లో 200 మంది విద్యార్థినులకు నాలుగు రూములే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి. విజయ్, దివాకర్, వెంకటలక్ష్మి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నారు చివర్లు తుంచి నాట్లు వేయాలి


చౌడువాడలో వారినారు తుంచి నాట్లు వేయడాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, సోమశేఖర్.

కె.కోటపాడు: రైతులు వరినాట్లును వేసే సమయాల్లో నారు చివర్లును తుంచి నాట్లు వేయాలని రైతులకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా బుధవారం చౌడువాడలో గల రైతులకు నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారు చివర్లు తుంచి నాట్లు వేయడం వలన కాండపు తొలిచే పురుగు రాకుండా అరికట్టవచ్చునని వివరించారు. దమ్ము సమయంలో ఎకరాకు 50 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలని, యూరియా వినియోగం తగ్గించడం ద్వారా పంట తెగుళ్ల బారిన పడకుండా చర్యలను తీసుకోవచ్చునని డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు అన్నారు. కౌలు రైతులకు కార్డుల కోసం గ్రామాల్లో గల వీఆర్వోలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ వి.చంద్రశేఖర్, తనకల అప్పలనాయుడు, బంటు శ్రీను, వీఏఏ రాము నాయుడు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని సమావేశమెందుకు?


కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

- మునగపాక మండల అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధుల ఆగ్రహం
- గౌరవ వేతనాల మంజూరులో తాత్సారంపై ఎంపీటీసీల ఆవేదన
- సర్వసభ్య సమావేశం నుంచి బయటకు వచ్చి నిరసన

మునగపాక: అధికారులు సమయపాలన పాటించకుంటే మండల సర్వసభ్య సమావేశం ఎందుకని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు, సూరిశెట్టి రాము, ఇల్లా శిరీష, మొల్లేటి కృష్ణవేణి, తదితరులతో పాటు సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, భీశెట్టి గంగప్పలనాయుడు, సుందరపు తాతాజీ, చదరం నాయుడు తదితరులు మండిపడ్డారు. గతంలో నిర్వహించిన సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలతో కూడిన అజెండాలో ఎందుకు పొందుపరచలేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా గడుస్తున్నా తమకు గౌరవ వేతనాలు ఎందుకు పెండింగ్‌లో ఉంచారని ప్రశ్నించారు. దీంతో బుధవారం జరిగిన మునగపాక మండల సర్వసభ్య సమావేశం గందరగోళం మధ్య సాగింది. తమకు గౌరవం ఇవ్వకుంటే ఈ సమావేశం ఎందుకుంటూ మండల సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నామంటూ సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చి వేరే గదిలో ప్రజా ప్రతినిధులు సమావేశమయ్యారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ జయలక్ష్మి, ఎంపీడీవో ఉషారాణి వారితో మాట్లాడే ప్రయత్నం చేశారు. గౌరవ వేతనం విషయంలో సరైన సమాధానం రాకపోవడం, సమావేశానికి ముందుగా కనీసం వారం రోజుల్లో సభ్యులతో సమావేశం నిర్వహించకపోవడం తగదంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నిరసనకు దిగారు. దీంతో ఎంపీడీవో ఉషారాణి కలగుజేసుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసుకోవాలని, ఇకపై ఎటువంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ప్రజా ప్రతినిధులంతా సమావేశ మందిరానికి చేరుకొని మినిట్స్ పుస్తకంపై సంతకాలు చేశారు. అనంతరం ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలన్నారు. అధికారులు స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ మండల పరిషత్‌కు వచ్చే నిధుల విషయంలో ప్రతి సభ్యునికి ముందస్తు సమాచారం ఇచ్చి వాటి వినియోగంపై అధికారులతో చర్చించిన తరువాత అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. ఇతర మండలాల్లో ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాలు అందుతుంటే మునగపాక మండల ప్రజా ప్రతినిధులకు ఎందుకు అందలేదో చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం అధికారులు తమ శాఖాపరమైన అభివృద్ధితో పాటు ముస్ముందు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ప్రస్తావించారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఈవోఆర్డీ సోమరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వరాహ నదిలో పూడిక తీత


నదిలో పూడిక తీతను పరిశీలిస్తున్న ఏఈ

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం నుంచి లింగరాజుపాలెం వెళ్లే వరాహ నది బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న పూడికను తొలగిస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ అమినా భాను బుధవారం తెలిపారు. సుమారు 30 ఏళ్ల ఈ బ్రిడ్జి సమీపంలో నదీ గర్భం పూడుకుపోవడంతో వరద నీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహించి, సమీపంలో ఉన్న భూములు కోతకు గురయ్యేవని చెప్పారు. బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కూడా ఏర్పడదన్నారు. ఈ మేరకు మండల పరిషత్ నిధులు రూ.4.5 లక్షలతో ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు సహకారంతో పూడిక తీత పనులు చేపడుతున్నామన్నారు. బ్రిడ్జి ఖానాలు శుభ్రం చేసి, గట్టు పటిష్టం చేయడం ద్వారా నది ప్రవాహం సజావుగా సాగుతాదని చెప్పారు. అయితే ఈ పనులు శాశ్వతం కాదని, పెద్ద మొత్తంలో నిధులు వస్తే నది గట్టుకు రాతి పేర్పు చేపట్టాలన్నారు.

క్వారీని రద్దు చేయాలంటూ నిరాహారదీక్ష


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేస్తున్న సాగుదారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, జి.కోడురు నల్లరాయి క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సాగుదారులైన దళితులు, ప్రజా సంఘాలు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టాయి. ఈ ధర్నాకు బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టా నాగరాజు, జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్ల చంటి, సీపీఎం నాయకులు చిరంజీవి, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీకి అనుమతులు ఇవ్వడం వల్ల దళిత సామాజిక వర్గాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. క్వారీ వల్ల గాలి, నీటి కాలుష్యం పెరిగి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. క్వారీ పేలుళ్లతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడతాయన్నారు. స్థానికుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్వారీని వెంటనే రద్దు చేయాలన్నారు. దాని వల్ల కలిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో క్వారీలకు అనుమతులు ఇచ్చే ముందు స్థానికుల అభిప్రాయం తీసుకోవాలన్నారు. క్వారీ అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ నిరాహారదీక్షలో అప్పారావు, గణేష్, లక్ష్మి, లవరాజు పాల్గొన్నారు.

ఆర్టీఐ యాక్టుపై విద్యార్థులకు అవగాహన

చోడవరం: సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్.ఎస్.ఎస్, డిపార్టుమెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థుకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ శాఖల నుంచి ఏమైనా సమాచారం కావాలంటే ఆర్‌టీఐ యాక్టును ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. దీనిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, పిఐఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

నామవరంలో 'పొలం పిలుస్తోంది'


నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట : మండలంలోని నామవరం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారు మడిలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలు వాడకం వల్ల ఉపయోగాలు, విత్తన శుద్ధి పాటించడం వల్ల కలిగే లాభాలు రైతులకు తెలియజేశారు. సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ రమ్య, సర్పంచ్ పన్నీరు పాపారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.